## క్లుప్తంగా

### ముక్కంటి సేవలో గుజరాత్ న్యాయమూర్తి



ఆలయంలో జస్టిస్ మానవేంద్రరాయ్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రరాయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

**సరస్వతీ మహరాజ్..**



ఆలయంలో శిష్య బృందంతో స్వామిజీ

శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రాత్రి హిమాలయాలకు చెందిన శ్రీజగద్గురు శంకరాచార్య వాసునంద సరస్వతి మహారాజ్ శిష్యబృందంతో కలసి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈవో నాగేశ్వరరావు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వారికి స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### జోరుగా ఉపాధి పనులు



పూడిక తీత పనులు చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: పంచాయతీ పరిధిలోని తంగెళ్లపురం చెరువు పూడికతీత పనులు ఉపాధి హామీ పథకం కింద జోరుగా సాగుతున్నాయి. పనులను 120 మంది కూలీలు చేస్తున్నారు. ఈపనితో పాటు భూముల అభివృద్ధి, చెరువు కట్టపై చెట్టు పుట్టలను తొలగించడం వంటి పనులు చేస్తున్నారు. ఈ పనులను శుక్రవారం ఏపీఓ భానుప్రియ పరిశీలించారు. నెలరోజుల పాటు పనులు కొనసాగుతాయని తెలిపారు. కూలీలకు రోజుకు రూ.250 కూలి గిట్టుబాటు అవుతోందన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం.. తిరుపతికి చెందిన సందీప్(37), రఘు(25) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతున్నారు. అంజిమేడు సమీపంలో ముందు వెళుతున్న కారును అధికమించడంతో ప్రమాదం జరిగింది. ఈఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

### ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవా ప్రతిభ కలిగిన వారిని ఉగాది–2024 పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టీఎస్ఎస్.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్య, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం , కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటక రంగం, టీవీ, సినీ రంగాలలో సేవలందించే ప్రతిభావంతులు ఉగాది పురస్కారాలకు అర్హులని తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే సభలో పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వారి సేవలను, ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్స్, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్స్, ఫొటోలు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఏప్రిల్ 4వ తేదీలోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెం.1–20–164, గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్–15 చిరునామాకు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 95523 47207 నంబరులో సంప్రదించాలని తెలియజేశారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

శ్రీకాళహస్తి : మండలంలోని వాగివేడు దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మణిపై శుక్రవారం రాత్రి టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. స్థానికుల కథనం.. వాగివేడు దళితవాడకు చెందిన మణి, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెంచలయ్య (కర్రయ్య), చింతల నరసింహులు, మరో ఆరుగురికి పాత గొడవలున్నాయి. దీన్ని మనసులో పెట్టుకుని శుక్రవారం రాత్రి కాపుకాచి మణిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జగనన్న పాలనకే ప్రజల మద్దతు





రాగిగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ సత్యవేడు అభ్యర్థి నూకతోటి రాజేష్, తిమ్మసముద్రంలో ర్యాలీ

- ప్రజల పొత్తే జగనన్న బలం
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

కేవీబీపురం (వరదయ్యపాళెం): ఐదేళ్లుగా సంక్షేమ పాలన అందించి ప్రజల హృదయాల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని.. మళ్లీ జగనన్న పాలనకే ప్రజలు మొగ్గు చూపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ తెలిపారు. కేవీబీపురం మండలంలోని రాగిగుంట, కొత్తూరు, తిమ్మసముద్రం, కోవనూరు, బ్రాహ్మణపల్లి, కర్లపూడి, బైరాజుకండ్రిగ, పవనవారికండ్రిగ పంచాయతీల్లో శుక్రవారం నూకతోటి రాజేష్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా ప్రజలు, మహిళలు, పార్టీ శ్రేణులు హారతులు, డప్పు వాయిద్యాలు, పూలజల్లులతో ఘన స్వాగతం పలికారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని నూకతోటి రాజేష్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలనకు, చంద్రబాబు పాలనకు తేడా గమనించాలని ప్రజలను కోరారు.

**చరిత్రలో లేని విధంగా సంక్షేమం**

మహిళాభివృద్ధే లక్ష్యంగా వారి పేరిట అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఇంతగా సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం చరిత్రలో లేదని తెలిపారు. నాడు చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోచుకుతింటే.. జగనన్న ప్రభుత్వంలో గ్రామ వలంటీర్లు నిస్వార్థ సేవకులుగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాబలంతో ఒంటరిగా పోటీ చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమంతో మీకు మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండని ధైర్యంగా అడిగే దమ్మున్న నాయకుడు జగనన్న అని అన్నారు. సంక్షేమ పథకాల పంపిణీకి జగనన్న 130 సార్లు బటన్ నొక్కారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒక్కో వ్యక్తి రెండుసార్లు ఫ్యాను గుర్తుపై బటన్ నొక్కి మీ భవిష్యత్తుకు, పిల్లల భవిష్యత్తుకు బాట వేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, సీనియర్ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, వసంత లాల్‌బాబు యాదవ్, తిరుపతి జిల్లా మహిళా కన్వీనర్ బొర్రా మాధవి రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, సింగిల్ విండో చైర్మన్ వెంకటరత్నం, జేసీఎస్ కన్వీనర్ శాస్త్రిరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డేవిడ్, ఎస్సీ సెల్ కన్వీనర్ అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీలు సరస్వతి, శ్రీనివాసులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రామ్మోహన్ వర్మ, ఎంపీటీసీలు శ్రీనివాసులు, నాగరాజు, స్థానిక సర్పంచులు గౌతమి, పెంచలయ్య, మురళీరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జగజ్జననీ పాహిమాం..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవార ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రీస్వామివారి దేవరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. తదుపరి అమ్మవారిని తిరుచ్చిపై కొలువుదీర్చి వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.



తిరుచ్చిపై విహరిస్తున్న అమ్మవారు

# కదిలింది కరుణ రథం..



శ్రీకాళహస్తి: శిలువ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

శ్రీకాళహస్తి: యేసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, క్షమ గుణాలు మానవాళికి అనుసరణీయమని చర్చి పాస్టర్లు సూచించారు. పట్టణంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. యేసుక్రీస్తును శిలువ వేసిన రోజును పురస్కరించుని చర్చిల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఉపవాస దీక్షలతో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు శిలువ ఉదంతాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు. శిలువను మోసుకుంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు వాక్కులను చర్చిలో ఫాదర్లు ప్రత్యేక ప్రసంగాలు చేశారు.

**భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే**

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని 36 చర్చిల్లో బైబిల్‌ను పఠించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను పాస్టర్లు వివరించారు. ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ వేయబడిన సమయానికి గుర్తుగా చర్చి గంటలు మోగించి మౌనం పాటించారు.



బీఎన్‌కండ్రిగ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్

# నేత్రపర్వంగా ఊంజల్‌సేవ

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయలలో కొలువుదీరి ఊంజల్ సేవలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఊయలలో సేదతీరుతున్న అమ్మవారని భక్తులు దర్శించి తరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊంజల్‌సేవలో సేద తీరుతున్న అమ్మవారు

### నిర్భయంగా ఓటు వేయండి



కాంపాళెంలో కేంద్ర బలగాల కవాతు

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. శుక్రవారం మండలంలోని కాంపాళెం, కంచనపుత్తూరు గ్రామాల్లో ఆయన పోలీసులు, కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఎన్నికలు శాంతియుతంగా నిర్వహిస్తామని నమ్మకం, భరోసా కలిగించేందుకోసం కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### బాలిక అదృశ్యం

ఏర్పేడు: మండలంలోని అంజిమేడులో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శుక్రవారం రాత్రి తెలిపారు. అంజిమేడు పంచాయతీ ఎర్రమిట్ట గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించింది. శుక్రవారం ఉదయం విద్యార్థిని ఇంటిలో కనిపించలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనబడక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

### రేపటి లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

శ్రీకాళహస్తి: మున్సిపల్ పరిధిలో ఆస్తి, ఖాళీ జాగాకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం పన్ను, పాత బకాయిలు వడ్డీ లేకుండా ఏకమొత్తంలో చెల్లించేందుకు ఆదివారం చివరి గడువని కమిషనర్ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బకాయి ఉన్న పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ సమీప సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో చెల్లించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ లేదా డెబిట్, క్రెడిట్‌కార్డుల ద్వారా కూడా చెల్లించవచ్చన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఏప్రిల్ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 5, 19, 26వ తేదీల్లో శుక్రవారాల్లో సాయంత్రం 6 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగిస్తారు. 4న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడుతారు. ఇదే రోజు శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 9వ తేదీ ఆలయంలో ఉగాది ఆస్థానం జరుగుతుంది. 12న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీపార్థసారథి స్వామివారు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సాయంత్రం శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీపట్టాభిరామ స్వామివారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. 20 నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం బుగ్గోత్సవం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. 21న ఉత్తర నక్షత్రం సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు ఉభయ నాంచారులతో కలిసి శ్రీగోవిందరాజ స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు.

# ఇంటింటా నవరత్నాల కాంతులు



కరకంబాడి పంచాయతీ సీఆర్‌నగర్ ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి

- ఎన్నడూ లేని విధంగా రేణిగుంట అభివృద్ధి
- ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: అర్హతే ప్రామాణికంగా నవరత్నాల పథకాల లబ్ధితో ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కరకంబాడి పంచాయతీ సీఆర్‌నగర్, గుండాలకాల్వ, చైతన్యపురం గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా కర్పూర హారతులతో ఆమెకు మహిళలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి నాలుగన్నరేళ్లలో అందిన పథకాల లబ్ధిని ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూనే మరో పక్క తన సొంత నిధులతో అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టారన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేశారని తెలిపారు. ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకుని కొండంత భరోసా ఇచ్చారన్నారు. 30 ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజల బాగోగులను పట్టించుకోకుండా పక్క రాష్ట్రంలో వ్యాపారాలను చూసుకుంటూ ఆస్తులను వెనకేసుకున్న వారంతా ఇప్పుడు ఎన్నికలకు రెండు నెలల ముందు వచ్చి ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. కరోనా కష్టకాలంలో వీరంతా ఏమైపోయారని ప్రశ్నించారు. రేణిగుంట మండలంపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశారని తెలిపారు.ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మరోసారి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, తొట్టంబేడు మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, రైతు సలహా మండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పైపుల రమేష్ రాయల్, ప్రకాష్, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ సుబ్బరత్నమ్మ, పీడీ దిలీప్, రాజేంద్ర, మునికృష్ణ, వెంకటరమణ, కుప్పయ్య, సుబ్రమణ్యం, బాబు, చంద్ర, సుబ్బయ్య, గోపాలయ్య, వెంకటేష్, నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీవాణిరెడ్డి

# ఆస్పత్రికి 30 లక్షల అంబులెన్స్ వితరణ





అంబులెన్స్ తాళాన్ని, డీఎం అండ్ హెచ్‌ఓకు అందజేస్తున్న మోండెలెజ్ ప్లాంట్ డైరెక్టర్ అమిత్ జైన్

- మోండెలెజ్ పరిశ్రమ చేయూత
- తాళాలు అందుకున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని క్యాడ్‌బరీ డైరీమిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి దిగ్గజ బ్రాండ్ల తయారీ పరిశ్రమ మోండెలెజ్ ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా శుక్రవారం సూళ్లూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వ ఆస్పత్రికి రూ. 30లక్షలు విలువైన అధునాతన వసతులు కలిగిన నూతన అంబులెన్స్‌ను వితరణగా అందజేసింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంఅండ్‌హెచ్ఓ) కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీహరికి మోండెలెజ్ ప్లాంట్ డైరెక్టర్ అమిత్ జైన్ అధికారికంగా అంబులెన్స్ తాళాలను అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత చర్యల ద్వారా ఈ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను బలోపేతం చేయడంలో తమ కంపెనీ నిబద్ధతను ఇది ధృవీకరిస్తుందంటూ ఈ సందర్భంగా అమిత్ జైన్ పేర్కొన్నారు. మెండెలెజ్ ఇండియాకు డాక్టర్ శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో మోండలెజ్ ఇండియా చొరవను అభినందించారు. సీఎస్ఆర్ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. మోండెలెజ్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు, శ్రీసిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేలు చేసిన వారినే ఆదరించండి

శ్రీకాళహస్తి: ఐదేళ్ల పాటు ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన బియ్యపు మధుసూదన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే కుమార్తె, వైఎస్సార్ సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని ముద్దుమూడి గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకూ తిరుగుతూ జగనన్న ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిని వివరించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేసిన మేలును వివరించారు. ఆమె మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే ఇంటికి పెద్ద దిక్కులా నిలిచారని, సొంత నిధులు రూ.కోట్లతో సహాయ కార్యక్రమాలు చేశారని తెలిపారు. మందులు, పండ్లు, కూరగాయలు, కోడిగుడ్లు తదితరాలు అందించి అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు నాలుగున్నర సంవత్సరాలు ప్రజలకు కనిపించకుండా ప్రస్తుతం ఎన్నికల కోసం వచ్చి మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ చరిత్రలో 30 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. ఈసారి గెలిస్తే మధుసూదన్‌రెడ్డి మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. అలాగే అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. ప్రతి ఇంటికీ పథకాల కింద రూ.లక్షల్లో లబ్ధి అందిందని చెప్పారు. నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధి వివరిస్తున్న పవిత్రారెడ్డి

# వైఎస్సార్ సీపీ గెలుపునకు మేమంతా సిద్ధం



మేమంతా జగనన్న వెంటే అంటున్న వైఎస్సార్ సీపీ దళిత ప్రజాప్రతినిధులు, నాయకులు


నారాయణవనం: తామంతా జగనన్న వెంటే అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల దళిత ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు స్పష్టం చేశారు. మండలంలోని దళిత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు తాము సిద్ధం–తమ దళితవాడలు సిద్ధమంటూ పేర్కొన్నారు. శుక్రవారం మీడియాతో వారు మాట్లాడుతూ బెదిరింపులకు, ప్రలోభాలకు లొంగేవాళ్లం తాము కామని, జగనన్న కోసం ఎన్నికల్లో పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి పనిచేస్తామని పేర్కొన్నారు. వ్యత్యాసం చూపకుండా అన్ని వర్గాలకు జగనన్న సంక్షేమ పాలన అందించారని అన్నారు. వ్యక్తుల కోసం కాకుండా జగన్ అనే వ్యవస్థ కోసం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పెద్దకొడుకైన జగనన్న మళ్లీ సీఎం అయితేనే అన్ని సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. పదవుల కోసం, అధికారం కోసం పాకులాడే వారు ప్రజలకు ఏమి మేలు చేస్తారని ప్రశ్నించారు. తమ అవసరాల కోసం పార్టీ మారే కోసం పనిచేయడానికి తాము సిద్ధంగా లేమని ఘాటుగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, ఎంపీటీసీ సభ్యులు రవి, మహేష్, సర్పంచ్‌లు నాగూరు, గుణశేఖర్, ఉప సర్పంచ్‌లు చీరాలయ్య, మురళి, ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ పీజీ బాబు, దళిత నాయకులు ఏలుమలై, అయ్యప్ప, గోవింద రాజులు, రాజశేఖర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### కనుపూరు జాతరకు 35 బస్సులు

కోట : కనుపూరు ముత్యాలమ్మ జాతరకు కోట నుంచి 35 బస్సులు నడపనున్నట్లు వాకాడు డిపో ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి 5వ తేదీ వరకు కనుపూరు ముత్యాలమ్మ జాతర జరగనున్న క్రమంలో భక్తుల సౌకర్యార్థం నాయుడుపేట నుంచి కోట మీదుగా కనుపూరుకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని వివరించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భక్తులకు కోట ఆర్టీసీ ప్రాంగణంలో మెరుగైన వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు.

# బీజేపీ శక్తులను ఓడించండి

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, దాని కూటమి శక్తులను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శుక్రవారం సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి గెలవాలని చూస్తోందన్నారు. మోదీ విధానం దేశానికి నష్టమని బీజేపీతో టీడీపీ, జనసేన జతకట్టడం సిగ్గుచేటని విమర్శించారు. ఆ పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్థన్, గంధం మణి, పెనగడం గురవయ్య, వెలివేంద్రం, రాజా తదతరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు